జగనన్నంటే నమ్మకం.. చంద్రబాబంటే మోసం

ఎమ్మిగనూరురూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాల్లో నిజాయితీకి, నమ్మకానికి బ్రాండ్ అంబాసిడర్ అని, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు మోసం, వెన్నుపోటుకు గుర్తింపు పొందారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక స్పష్టం చేశారు. ఆమె బుధవారం మండల పరిధిలోని కె.తిమ్మాపురం, టీఎస్.కూశ్లూరు, కలుగోట్ల, కె.నాగలాపురం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. పార్టీ సీనియర్ నాయకుడు జగన్‌మోహన్ రెడ్డి, వీరశైవలింగాయత్ కార్పొరేషన్ చైర్మన్ వై.రుద్రగౌడ్, మండల కన్వీనర్ బీఆర్.బసిరెడ్డితో కలసి ఆయా గ్రామాల్లో జీపు ర్యాలీలో ప్రసంగించారు. ఆమె మాట్లాడుతూ.. 2019కి ముందు ఇచ్చిన హామీలన్నీ జగనన్న నేరవేర్చారని గుర్తుచేశారు. 2024 మేనిఫెస్టోలో అన్ని వర్గాల సంక్షేమానికి ప్రాధాన్యతనిచ్చారని వివరించారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ప్రజలకు ఏమి చేశాడని ప్రశ్నించారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే మరోసారి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని విన్నవించారు.

దమ్మున్న నాయకుడు సీఎం జగన్

వైఎస్సార్‌సీపీ పాలనలో మేలు జరిగిఉంటే ఓటు వేసి ఆశీర్వదించాలని చెప్పిన దమ్మున్న నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని పార్టీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్, వీరశైవ లింగాయతీ కార్పొరేషన్ చైర్మన్ వై.రుద్రగౌడ్ అన్నారు. వారు మాట్లాడుతూ.. సీఎం జగనన్న అమలుచేస్తున్న సంక్షేమ పథకాల వల్ల రాష్ట్ర అప్పుల ఊబిలో కూరుకుపోతుందని మరో శ్రీలంకగా మారుతుందని విమర్శించిన చంద్రబాబు ఇప్పుడు అంతకంటే ఎక్కువ పథకాలను అమలు చేస్తానని చెబుతూ ప్రజలను మోసగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ మాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు సూచించారు. నాయకులు శశికళారెడ్డి, గొల్ల కేశన్న, భీమిరెడ్డి, లావణ్య, విజయలక్ష్మి, చిట్టిమ్మ, చంద్రశేఖర్ రెడ్డి, అబ్రహం, సోమేశ్వరరెడ్డి, రాముడు, బడేసాబ్, వెంకట్రాముడు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరికల వెల్లువ

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కె.తిమ్మాపురంలో జనసేన, టీడీపీ, కమ్యూనిస్టు పార్టీలకు చెందిన 200 కుటుంబాలు బుధవారం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక సమక్షంలో ఆ పార్టీలో చేరాయి. కార్యకర్తలు బి.మంజునాథ్, రామలింగప్ప, నాగేష్, ఈరన్న, పరమేష్, సాంబయ్య, సోమేష్, రాఘప్ప, తదితరులు పార్టీలో చేరగా ఆమె కండువాలు కప్పి ఆహ్వానించారు.

ఎమ్మిగనూరుటౌన్: గోనెగండ్ల మండల పరిధిలోని ఎర్రబాడు, వేముగోడు గ్రామాలకు చెందిన ముస్లిం టీడీపీ నాయకులు బుధవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టారేణుక, పార్టీ నాయకులు శివనీలకంఠ, యుగంధర్ సమక్షంలో వైఎస్సార్‌సీపీ చెంతన చేరారు. అలాగే ఎమ్మిగనూరు మండలంలోని సిరాలదొడ్డి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఖాజతో పాటు పలువురు బాబు ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.

● రాష్ట్రంలో మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించడమే లక్ష్యంగా పనిచేస్తామని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సేవా సంఘ అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యుడు సిద్దవటం యానాదయ్య పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుకను నియోజకవర్గంలోని నాయీ బ్రాహ్మణులు కలిసి తమ మద్దతు తెలిపారు. అనంతరం నాయీ బ్రాహ్మణులకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలతో ఆ సంఘం ముద్రించిన కరపత్రాలను ఆమె ఆవిష్కరించారు. ఎమ్మిగనూరు నాయీ బ్రాహ్మణ సేవా సంఘం తాలుకా అధ్యక్షుడు మద్దిలేటి, నాయకులు ఒలంపిక్ గోవిందు, రాయల్ కృష్ణ, ఉత్తమ్ నాగరాజుతో పాటు మరో వంద మంది వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపారు.



కె.తిమ్మాపురంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక



కె.తిమ్మాపురంలో ఎంపీటీసీ విజయలక్ష్మితో ఆప్యాయంగా మాట్లాడుతున్న బుట్టా రేణుక



కె.తిమ్మాపురంలో పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న బుట్టా రేణుక



బుట్టా రేణుక సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన ఎర్రబాడు గ్రామ టీడీపీ శ్రేణులు



వైఎస్సార్‌సీపీలో చేరిన కాంగ్రెస్ నేత సిరాలదొడ్డి ఖాజ తదితరులతో బుట్టా రేణుక



నాయీ బ్రాహ్మణ సంఘం కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బుట్టా రేణుక

వైఎస్సార్‌సీపీతోనే దూదేకులకు గుర్తింపు



దూదేకుల ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న బుట్టా రేణుక

ఎమ్మిగనూరుటౌన్: రాష్ట్రంలో నూర్‌బాషా దూదేకుల సామాజికవర్గానికి గుర్తింపునిచ్చిన పార్టీ వైఎస్సార్‌సీపీ అని బుట్టా రేణుక అని పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని బాబు ఫంక్షన్ హాల్‌లో మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ ఆధ్వర్యంలో నూర్‌బాషా దూదేకుల సామాజికవర్గ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. దూదేకుల పట్ల ఎవరూ అవహేళనగా మాట్లాడకుండా సీఎం వైఎస్ జగన్ చట్టాన్ని తెచ్చారని గుర్తుచేశారు. దూదేకులకు తగిన ప్రాధాన్యత ఇచ్చి పదవులు కల్పించడంతో పాటు సంక్షేమ పథకాలు వర్తింపజేశారన్నారు. నియోజకవర్గంలోని దూదేకుల సమస్యలను పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నూర్‌బాషా సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎస్ బాజీ, స్థానిక నాయకులు దస్తగిరి, ఇర్ఫాన్, మన్సూర్‌అహమ్మద్, రాజాచాంద్, చైతన్య ఖాశిం, నబిరసూల్, సిరాలదొడ్డి ఖాజ, మాబుహుసేన్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

టీడీపీ హామీలు నమ్మి మోసపోవద్దు

నందవరం: అమలు చేయలేని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేయడమే చంద్రబాబు నైజమని వైఎస్సార్‌సీపీ మండల అధికార ప్రతినిధి వెంకటేష్ అన్నారు. ఆయన బుధవారం నదికైరవాడి గ్రామస్తులకు 'నేరవేర్చలేని టీడీపీ హామీలు - జగనన్న మేనిఫెస్టో'పై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ.. 2019 మేనిఫెస్టోను సీఎం జగనన్న భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా భావించి 99 శాతం హామీలను నేరవేర్చాన్నారు. 2014లో చంద్రబాబునాయుడు 600 హామీలు ఇచ్చి ఏ ఒక్కటీ నెరవేర్చలేదని వివరించారు. ఇచ్చిన మాటకు కట్టుబడే ముఖ్యమంత్రి జగనన్నను మరోసారి గెలిపించాలని కోరారు.

రైల్వేస్టేషన్‌లో చలివేంద్రాల ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న బి.వెంకటేశ్వర్లు

ఆదోని సెంట్రల్: ఆదోని రైల్వేస్టేషన్లో ప్రయాణికుల సౌకర్యార్థం స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లు, బుకింగ్ ఆఫీస్ సూపర్‌వైజర్ తిభువన్ ఆధ్వర్యంలో బుధవారం చలివేంద్రాలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. ఎండ తీవ్రత వల్ల ట్యాపులలో నీరు వేడిగా వస్తున్నాయని తెలిపారు. ప్రయాణికుల సౌకర్యార్థం ప్లాట్‌ఫారం-1పై పది చోట్ల చలివేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైల్వే సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ పకడ్బందీగా నిర్వహించాలి



అవగాహన కల్పిస్తున్న ఆర్‌ఓ చిరంజీవి

ఎమ్మిగనూరుటౌన్: సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొనే పీఓ, ఏపీఓలు ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పోలింగ్ పకడ్బందీగా నిర్వహించాలని రిటర్నింగ్ అధికారి చిరంజీవి సూచించారు. బుధవారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పీఓ, ఏపీఓలకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఎన్నికల నిర్వహణ, ఈవీఎం బ్యాలెట్‌లపై మాస్టర్ ట్రైనర్లు అవగాహన కల్పించారు. ఎంపీ స్థానానికి రెండు ఈవీఎంలు ఉంటాయని వాటిని కనెక్ట్ చేసుకునే విధానం, అసెంబ్లీ స్థానానికి ఈవీఎం నిర్వహణపై సూచనలిచ్చారు. అదే విధంగా పీఓ డైరీ, మాక్‌పోలింగ్, వీవీ ప్యాట్ గురించి వివరించారు. తహసీల్దార్ శేషారెడ్డి, డీటీలు రఘువీర్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

జంపాపురం విద్యార్థుల ప్రతిభ

కోసిగి: మండల పరిధిలోని జంపాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేసిన నలుగురు విద్యార్థులు జ్యోతిరావుపూలే (బీసీ వెల్ఫేర్) గురుకుల కళాశాల ఇంటర్మీడియెట్ ప్రవేశ పరీక్షలో సత్తా చాటారు. బుధవారం ఈ ఫలితాలు వెలువడ్డాయి. ఇందులో ఎంఈసీలో ఎస్.నాగరాజు జిల్లా 2వ ర్యాంకు, ఉప్పర శిరీష బైపీసీలో జిల్లాలో 4వ ర్యాంకు, బి.శాంతి బైపీసీ లో జిల్లా 34వ ర్యాంక్, లక్ష్మీనరసమ్మ బైపీసీలో జిల్లా లో 41వ ర్యాంకు సాధించారు. ర్యాంకులు సాధించిన విద్యార్థినులను ప్రధానోపాధ్యాయుడు బందెనవాజ్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

లారీ ఢీకొని వ్యక్తికి గాయాలు

ఆదోని అర్బన్: మండల పరిధిలోని కడితోట గ్రామ సమీపంలోని ఆశ్రమం వద్ద బుధవారం లారీ ఢీకొన్న ఘటనలో పట్టణానికి చెందిన బసవ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 ద్వారా ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుడు నీలకంఠ పోలీసులకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కౌతాళం గ్రామంలో పని ముగించుకొని ఆదోనికి వస్తుండగా కడితోట గ్రామం వద్ద బైకు పంచర్ కావడంతో బసవ బైకును తోసుకుంటూ వస్తుండగా లారీ వేగంగా వచ్చి ఢీకొట్టి బోల్తా పడింది. గాయాలపాలైన బసవను వెంటనే ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స చేసిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు రెఫర్ చేశారు. ప్రమాదంపై కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

56 మంది వలంటీర్ల రాజీనామా

ఆదోని టౌన్: ఆదోని మున్సిపాలిటీలో 56 మంది వార్డు వలంటీర్లు బుధవారం విధులకు రాజీనామా చేశారు. అడ్మిన్‌లకు రాజీనామా పత్రాలను అందించగా ఆమోదం కోసం ఉన్నతాధికారులకు పంపారు. నిస్వార్థంగా సేవచేస్తున్న తమపై ప్రతిపక్ష నాయకులు తప్పుడు ఆరోపణలు చేయడంతో పాటు ఎన్నికల కోడ్‌ను అడ్డం పెట్టుకుని తమ సేవలను అడ్డుకోవడంతో మనస్తాపం చెంది విధులకు రాజీనామా చేసినట్లు వారు వెల్లడించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ఆదోని రూరల్: ఆదోని పట్టణంలోని బోయగేరికి చెందిన బోయ సరోజ, బోయ అరుణ బుధవారం సిరుగుప్ప నుంచి కేఎస్ ఆర్టీసీ బస్సులో మద్యం తరలిస్తుండగా పట్టుకొని అరెస్టు చేసినట్లు ఇస్వీ ఎస్‌ఐ శ్రీనివాసులు బుధవారం తెలిపారు. మండలంలోని పెద్దహరివాణం చెక్‌పోస్టు వద్ద తనిఖీలు చేపట్టి ఒక్కొక్కరి నుంచి రెండు బాక్సుల చొప్పున ఓసీ 90 ఎంఎల్ పరిమాణం గల ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

వాడవాడలా విస్తృత ప్రచారం





ఆదోనిలో ప్రచారం చేస్తున్న హిరణ్మయిరెడ్డి, ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న మనోవిద్యారెడ్డి

ఆదోని టౌన్: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గుర్తు ఫ్యాన్‌పై ఓటు వేసి ఎమ్మెల్యేగా సాయిప్రసాద్ రెడ్డిని గెలిపించాలని కోరుతూ బుధవారం ఎమ్మెల్యే తనయుడు మనోజ్‌కుమార్‌రెడ్డి, ఆయన సతీమణి హిరణ్మయిరెడ్డి, కుమార్తెలు గౌతమిరెడ్డి, మనోవిద్యారెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. 42వ వార్డు హనుమాన్‌నగర్, మాసామసీదు, మారెమ్మ దేవాలయం ఏరియాల్లో ఓటర్లను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వం చేసిన మేలును వివరిస్తూ ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా సాయిప్రసాద్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని గెలిపిస్తే రాష్ట్రాభివృద్ధి, రెట్టింపు సంక్షేమ పథకాలు అందుతాయని వివరించారు. పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేలా మేనిఫెస్టోను రూపొందించారన్నారు. అసాధ్యం కాని హామీలతో చంద్రబాబు మేనిఫెస్టోను విడుదల చేసి మరో మారు రాష్ట్ర ప్రజలను మోసం చేయడానికి పూనుకున్నారని మనోజ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, పట్టణాధ్యక్షుడు దేవా, డైరెక్టర్లు మంజుల, రేణుక, నాయకులు లోకేశ్వరి, శ్రీలక్ష్మి, శోభాలత, కల్పవల్లి, లక్ష్మి, లక్ష్మన్న, తాయన్న, లోకేష్, అనిల్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే మహిళల అభ్యున్నతి



ఎమ్మిగనూరు 17వ వార్డులో ప్రచారం చేస్తున్న బుట్టా సాహితి

ఎమ్మిగనూరుటౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే మహిళా అభ్యున్నతి సాధ్యమని వైఎస్సార్‌సీపీ నాయకురాలు బుట్టా సాహితి పేర్కొన్నారు. ఆమె బుధవారం పట్టణంలోని 17వ వార్డులో రాష్ట్ర కుర్ణికరికల కార్పొరేషన్ చైర్మన్ బుట్టా శారదమ్మ, వార్డు కౌన్సిలర్ సంధ్యారాణి, ఇన్‌చార్జ్ రామాంజినిరెడ్డితో కలిసి తన అత్త, వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టారేణుకను గెలిపించాలని కోరుతూ విస్తృతంగా ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి ఐదేళ్లలో ప్రభుత్వం చేసిన మేలును వివరిస్తూ ఓటు అభ్యర్థించారు. టీడీపీ మాటలు నమ్మి మోసపోవద్దని, సంక్షేమ సారధి జగనన్నకు మరోసారి పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. కౌన్సిలర్ వాహిద్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబువి బూటకపు హామీలు



గాజులదిన్నెలో వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న బుట్టా ప్రతుల్

గోనెగండ్ల: ఎన్నికల వేళ టీడీపీ అధినేత చంద్రబాబు ఇస్తున్న బూటకపు హామీలను నమ్మి మోసపోవద్దని, విజ్ఞతతో ఓటు వేయాలని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు బుట్టా ప్రతుల్ విజ్ఞప్తి చేశారు. ఆయన బుధవారం ఉదయం గాజులదిన్నె గ్రామంలో, సాయంత్రం ఎర్రబాడు గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి ఫ్యాన్ గుర్తుకే ఓట్లు వేసి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు బుట్టా రేణుక, బీవై రామయ్యలను గెలిపించాలని కోరారు. సర్పంచులు వెంకటేశ్వర రెడ్డి, అరుణజ్యోతమ్మ నాయకులు బందెనవాజ్, మల్లికార్జున రెడ్డి, కాశీరెడ్డి, రవికుమార్ నాయుడు, దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

జనసేనకు షాక్

ఆదోని టౌన్: మతతత్వ బీజేపీతో జనసేన పార్టీ పొత్తు పెట్టుకోవడం నచ్చక ఆ పార్టీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు కార్యకర్తలు అగర్‌బత్తి చాంద్ భాయ్, షాదిక్, మేస్త్రీ మహ్మద్, ఇనాయిద్‌సాహెబ్, జలీల్, ఇస్మాయిల్, అజీద్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే నివాసంలో యువనేత మనోజ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కొడల్‌పేట ప్రాంతానికి చెందిన జనసేన పార్టీ కార్యకర్తలు దాదాపు 200 మంది వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారికి మనోజ్‌కుమార్‌రెడ్డి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. రాష్ట్ర ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వైఎస్సార్‌సీపీ అందిస్తున్న పాలనకు మెచ్చి ఆ పార్టీలో చేరినట్లు వారు వెల్లడించారు.



యువనేత మనోజ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరిన జనసేన నాయకులు

అభివృద్ధిని చూసి ఓటెయ్యండి

కోసిగి: అభివృద్ధి చేసే నాయకుడికి ఎన్నికల్లో పట్టం కట్టాలని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి కోరారు. ఆయన బుధవారం కోసిగి మండలంలోని పల్లెపాడు, చింతకుంట గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేపసి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డిని గెలిపించాలని కోరారు. చింతకుంట, పల్లెపాడు గ్రామాల్లో పాతికేళ్లుగా నెరవేరని రోడ్డు కలను ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో పరిష్కరించారని గుర్తు చేశారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే జగనన్నను మరోసారి సీఎంగా గెలుపించుకుందామని, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి, ఎంపీ అభ్యర్థి బీవై రామయ్యను గెలిపించాలని కోరారు. నాయకులు బెట్టన గౌడ, శ్రీనివాస రెడ్డి, నాగరాజు, మహంతేష్ స్వామి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



పల్లెపాడులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

టీడీపీ మేనిఫెస్టోతో కురువలకు అన్యాయం

కోసిగి: కురువలను మోసం చేసిన ఘనుడు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు అని కురువ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుడిసె శివన్న అన్నారు. బుధవారం కోసిగిలో ఆయన మాట్లాడుతూ.. టీడీపీ మేనిఫెస్టోలో కురువలు, యాదవులను ఒకే జాబితాలో పేర్కొన్నారన్నారు. కురువలు బీసీ-బీ, యాదవులు బీసీ-డీ కేటగిరీలో ఉన్నారని చెప్పారు. కురువలకు రావాల్సిన ఫలాలన్నీ యాదవులకు కట్టబెట్టే ధోరణిలో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కురుబలందరూ చంద్రబాబుకు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

టీడీపీ మేనిఫెస్టో అంతా బూటకమే



బాపురంలో ఎద్ల బండిపైనుంచి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి



వైఎస్సార్‌సీపీలో చేరిన రౌడూరు గ్రామస్తులతో ఎమ్మెల్యే

మంత్రాలయం/కౌతాళం: తెలుగుదేశం పార్టీ నాయకుల అబద్ధాలను నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సూచించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన కౌతాళం మండలంలోని కాత్రికి, లింగాలదిన్నె, అగసలదిన్నె, డంబలదిన్నె, బాపురం, వీర్లదిన్నె, రౌడూరు, ఉప్పరహాల్, కుంటనహాల్, బదినేహాల్, తోవి, ఎరిగేరి గ్రామాల్లో పర్యటించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. లేనిపోని హామీలు ఇవ్వడం అధికారంలోకి రాగానే చేతులెత్తేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అన్నారు. అధికార దాహంతో సూపర్ సిక్స్ పథకాల పేరుతో ఊరేగుతున్నారని, ఆయన హామీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చంద్రబాబుకు నక్కకు నాకలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. 2014 ఎన్నికల్లో రైతు, డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని చెప్పి అధికారంలోకి రాగానే చేతులెత్తేశారని గుర్తు చేశారు. జగనన్న హయాంలో ప్రజల వద్దకే పాలన తీసుకొచ్చారని వివరించారు. ఉన్న ఊరిలోనే సకల సేవలు అందుతున్నాయని చెప్పారు. ప్రజలు మేలు చేసిన వారిని మరవబోరని కృతజ్ఞతతో తమను ఆశీర్వదిస్తారని ధీమా వ్యక్తం చేశారు. మండల కన్వీనర్ ప్రహ్లాదాచార్, జెడ్పీటీసీ రాధాప్రియదర్శిని, ఎంపీపీ అమరేష్, నాయకులు లిఖితారెడ్డి, గురునాథ్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, సోమిరెడ్డి, తులసి, పార్వతమ్మ, నరసమ్మ, గోవిందు, నీలకంఠరెడ్డి, తోవి నరసప్ప తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో చేరిక

కోసిగి: సిద్దప్ప పాళెం ఊరువాకిలికి చెందిన టీడీపీ కార్యకర్తలు 15 కుటుంబాలు ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. బుధవారం ఎమ్మెల్యే స్వగ్రామం రాంపురంలో వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో వారు పార్టీలో చేరగా ఎమ్మెల్యే కండువాలు వేసి ఆహ్వానించారు.

అలాగే మంత్రాలయం నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ తరుపున పోటీ చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి వై.బాలనాగిరెడ్డి గెలుపునకు అగసనూరు గ్రామంలోని అన్ని కులాల వారు మద్దతు తెలిపారు. బుధవారం సాయంత్రం గ్రామంలో సర్పంచ్ వడ్డె ఉలిగయ్య ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ కులాలు వారంతా ఒకచోట చేరి ఎమ్మెల్యేను గెలిపించేందుకు తామంతా సిద్ధం అని నినాదాలు చేశారు.

కౌతాళం: మండల పరిధిలోని రౌడూరు, గుడికంబాలి గ్రామాలకు గ్రామానికి చెందిన పలు కుటుంబాలు బుధవారం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

ట్యాంకర్లతో నీటి సరఫరా

గోనెగండ్ల: తాగునీటి సమస్య ఉన్న గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేయనున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస రెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ టి.నసురుద్దీన్ అధ్యక్షతన, ఎంపీడీఓ సోనిబాయి ఆధ్వర్యంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ.. మండలంలో హెచ్.కై రవాడి, బి.అగ్రహారం, బైలుప్పల, వేముగోడు, ఎర్రబాడు, పెద్దనేలటూర్, చిన్న నేలటూర్ గ్రామాలకు గురువారం నుంచి ట్యాంకర్లతో మంచినీరు సరఫరా చేస్తామన్నారు. విద్యుత్ ఏఈ సుధాకర్, ఏపీఓ మహబూబ్ బాషా ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఎంపీడీఓ సోనిబాయి మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారంపై అధికారులు దృష్టి పెట్టాలన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

ఓటరు స్లిప్పుల పంపిణీ

నందవరం: మండలంలోని ఆయా గ్రామాల్లో బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్‌ఓలు) ఓటరు స్లిప్పులను పంపిణీ చేశారు. బుధవారం తహసీల్దార్, మండల ఎన్నికల అధికారి ఓబులేసు ఆదేశాల మేరకు మండల పరిధిలోని జొహరాపురం, పెద్దకొత్తిలి, గంగవరం తదితర గ్రామాల్లో బీఎల్‌ఓలు స్లిప్పులను ఓటర్లకు అందజేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. మండలంలో 46,287 మంది ఓటర్లు ఉన్నారని, ఇప్పటివరకు 9,235 మందికి స్లిప్పులను పంపిణీ చేశామన్నారు. 6వ తేదీలోగా ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి కావాలని ఆదేశించారు.

ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తించాలి



మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకులు మిర్‌తారిఖ్ అలీ

ఆదోని రూరల్: ఎన్నికల విధుల్లో పాల్గొనే ప్రతి ఉద్యోగి సక్రమంగా విధులు నిర్వర్తించాలని ఆలూరు, ఆదోని, పత్తికొండ నియోజకవర్గాల ఎన్నికల పరిశీలకులు మిర్‌తారిఖ్ అలీ సూచించారు. ఈ మేరకు బుధవారం ఆదోని పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల సిల్వర్ జూబ్లీ హాల్‌లో ఆదోని-146 నియోజకవర్గానికి సంబంధించిన పీఓ, ఏపీఓలకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పీఓలు, ఏపీఓల విధులు, ఓటింగ్ సమయంలో తలెత్తే సమస్యలకు పరిష్కారాలను వివరించారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా అందరూ సహకరించాలన్నారు. పోలింగ్‌కు గంట ముందే ఈవీఎం మిషన్లను సరి చూసుకోవాలన్నారు. ఈవీఎంల పనితీరును ఎప్పటికప్పుడు సమీక్షించాలని సూచించారు. ఇబ్బందులు తలెత్తితే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. తహసీల్దార్ హసీనాసుల్తానా, వీరభద్రప్ప తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

ప్రజాసేవకు అంకితం

ఆదోని టౌన్: ప్రజాసేవకే తన జీవితం అంకితమని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన బుధవారం చిన్న శక్తిగుడి, గణేష్ సర్కిల్ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆ ప్రాంతాల్లో బహిరంగ సభల్లో మాట్లాడారు. తమ కుటుంబంలో ముగ్గురు ఎమ్మెల్యేలు, ఒక ఎమ్మెల్సీ, మరొకరు టీటీడీ బోర్డు డైరెక్టర్‌గా ఉన్నారన్నారు. ఎవరికైనా మాట ఇచ్చామంటే కట్టుబడి నెరవేర్చే వరకు విశ్రమించబోమని చెప్పారు. ఆదోనిలో పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి డాక్టర్ పార్థసారథి నోరు అదుపులో పెట్టుకోవాలని సూచించారు. నోటికొచ్చినట్లు మాట్లాడడం మంచిది కాదన్నారు. ప్రశాంతంగా ఉన్న ఆదోనిలో గొడవలు పెట్టేందుకే వచ్చారని ఆరోపించారు. లోకేష్‌ను సీఎంను చేయాలనే ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.3 లక్షల కోట్లను కొల్లగొట్టి అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చారని దుయ్యబట్టారు. సీఎం జగనన్న ప్రతి వార్డులో సందుసందునా అభివృద్ధి పనులు చేసి ఆదోనిని ఆదర్శంగా తీర్చిదిద్దారని వివరించారు. టీడీపీ, జనసేన పార్టీలు అభివృద్ధి జరగలేదని ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని, విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, వార్డు కౌన్సిలర్ సురేష్, చైర్‌పర్సన్ బోయ శాంత తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

ఆదోని రూరల్: ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి నివాసంలో బుధవారం మండలంలోని సంతెకూడ్లూరు గ్రామానికి చెందిన 118 మంది టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో హైదర్, చాంద్‌బాషా, ఆలం, పచ్చారపల్లి రాఘవేంద్రరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, ఎస్.కె.ఎర్రిప్రసాద్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు ఉన్నారు.